క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఎమ్మెల్యే 101 కొబ్బరికాయాలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు అయ్యగారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని మహిళలను కలిసి నియోజకవర్గ అభివృద్ధి, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే మహిళలకు భరోసా ఇచ్చారు. నాయకులు బిరుదు రాజమల్లు, బల్మూరి వెంకటరమణ, కవ్వంపల్లి తిరుపతి, ప్రకాశ్‌రావు, పులి వెంకటేశం, జానీ, బక్కయ్య, చక్రధర్ ఉన్నారు.

అన్నదానం మహాదానం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్సై జీవన్

జ్యోతినగర్: అన్నదానం మహా గొప్పదానమని ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ అన్నారు. మంగళవారం మేడిపల్లి సెంటర్‌లో వాసవీమాత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇతరులకు సాయం చేయాలని కోరారు. పేదలకు, అన్నార్థులకు సాయం అందించి మానవత్వాన్ని నిలబెట్టాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సమాజసేవలతో ముందుకుసాగాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, ఆర్యవైశ్య సంఘం నాయకులు రావికంటి ఈశ్వర్, సుద్దాల రమేశ్, సురేశ్, రవి, మహేశ్, పబ్బ వెంకటేశ్వర్లు, రాజు, శంకరయ్య, శ్రీశైలం, సాంబమూర్తి, నల్ల అశోక్, రమేశ్, రాంచందర్ పాల్గొన్నారు.

నేడు అన్నపూజ మహోత్సవం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం అన్నపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది. బుధవారం ఉదయం రుద్రాభిషేకం, అన్నపూజ, సాయంత్రం 108 దీపాలతో లింగార్చన ఉంటుందన్నరు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న సంఘం కార్యదర్శి సంపత్

ఓదెల: మండలంలో దివ్యాంగుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట దివ్యాంగుల సంఘం జిల్లా కార్యదర్శి సంపత్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.సత్తయ్య, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, ఏపీఎం లతామంగేశ్వరీ పాల్గొన్నారు.

ముస్త్యాలకు బస్సులు నడపండి



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ లావణ్య

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సింగరేణి ప్రభావిత గ్రామమైన ముస్త్యాల గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ మంగళవారం సర్పంచ్ లావణ్య ఆర్టీసీ ఇన్‌చార్జితో పాటు ఆర్జీ–1 సింగరేణి అధికారులకు వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, గ్రామప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన రోడ్డు జనగామ, సుందిళ్ల, ముస్త్యాల మీదుగా బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూసారానికి ముప్పు

- వరికోతల అనంతరం కొయ్యలు, వరిగడ్డి కాలుస్తున్న రైతులు
- దిగుబడి ఆశించిన స్థాయిలో రాదంటున్న అధికారులు



ఎలిగేడు మండల కేంద్రంలో వరికొయ్యలు, గడ్డికి నిప్పపెట్టిన రైతులు

ఎలిగేడు: కొన్నేళ్ల కిందట వరికోతల అనంతరం రైతులు గడ్డిని కుప్పలుగా వేసి పశువులకు మేతగా ఉపయోగించేవారు. ప్రసుత్తం కూలీల కొరత ఉండటంతో రైతులు యంత్రాలతో వరి కోయిస్తున్నారు. అనంతరం పొలంలో మిగిలిన కొయ్యలతోపాటు గడ్డికి ఎలిగేడు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కొంత మంది రైతులు నిప్పంటిస్తున్నారు. అవగాహన లోపంతో రైతన్నలు గడ్డికి, కొయ్యలకు నిప్పంటిస్తుండటంతో భూసారానికి ముప్పు వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వరి గడ్డిని, కొయ్యలను కాల్చివేయడంతో పంట దిగుబడి ఆశించినస్థాయిలో రాదని చెప్తున్నారు. పంటలకు కీడు చేసే పురుగులను తినే వానపాములు, కీటకాలు నశించే ప్రమాదం ఉందని చెప్తున్నారు. భూమిలో అవశేషాలు, ఖనిజ లవణాలు నశిస్తాయని అంటున్నారు. ప్రస్తుతం చలికాలం కావడంతో ఎక్కువ మొత్తంలో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది.

వరికొయ్యలకు, గడ్డికి నిప్పంటిస్తే..

వరిపొలంలో గడ్డికి నిప్పంటిస్తే ఆ భూమిలో ఒక సెంటీమీటర్ లోతు వరకు భూమిపై పొరలో మట్టి 33.8 నుంచి 42.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు గురవుతుంది. అత్యంత కీలకమైన జీవరాశులు, శిలీంధ్రాల సంతతి నశించిపోతుంది, భూమి సేంద్రియ లక్షణం నాశనమవుతుంది. భూమిపై పొరలో మేలు చేసే మిత్రపురుగులు నశించడంతో పంటలపై పురుగుల దాడి పెరిగిపోతుంది. టన్నుల పంటవ్యర్థం తగులబెట్టినప్పుడు మట్టిలో సేంద్రియ కర్బనంతోపాటు (505కిలోల నత్రజని, ఫాస్ఫరస్, 25కిలోల పొటాషియం, కిలోకు పైగా గంధకం) 33.8 పోషకాలు నాశనమవుతాయి.

ఇలా చేస్తే మేలు..

పంటల సాగులో వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

పంటల కోత పూర్తయిన తరువాత మిగిలిన పంటల అవశేషాలను భూమిలో మరుగబెట్టి దుక్కిలో కలిపి కలియదున్నాలి. ఇలా చేయడంతో వరిగడ్డి , వరి కొయ్యలు భూమిలో మరిగి సేంద్రియ ఎరువుగా మారుతుంది.

రైతులకు వివరిస్తున్నాం



పంట భూముల్లో గడ్డి, వరి కొయ్యలను దహనం చేస్తే భూసారం కోల్పోతుంది. అవసరంలేని గడ్డిని భూమిలోనే కలిపి దున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూమికి అవసరమైన పోషకాలు అందిస్తుంది. ఈ విషయంపై గ్రామాల్లో ఏఈవోల ద్వారా వివరిస్తున్నాం. – ఏవో ఉమాపతి, ఎలిగేడు

అవగాహన కల్పించాలి



పంటకోత యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి మిగిలిన కొయ్యలను, గడ్డిని తగలబెడుతున్నాం. ఇలా చేస్తే భూసారం తగ్గుతుందని తెలియదు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– భూసారపు శ్రీకాంత్, యువ రైతు

సమయం ఆదా కోసం..



ప్రస్తుత కాలంలో రైతులకు గడ్డి పోగేసి, కొయ్యలను ముగరబెట్టేంత సమయం లేకుండా పోయింది. కూలీల సమస్య కూడా తీవ్రంగా ఉంది. దీంతో సమయం ఆదా కోసం వరికొయ్యలను తగలబెట్టడం తప్పడంలేదు.

– శ్రీనివాస్, రైతు, ధూళికట్ట

రోడ్డు నిర్మాణంతో పైప్‌లైన్ ధ్వంసం

- పరిశీలించిన చైర్‌పర్సన్, కమిషనర్



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

సుల్తానాబాద్: రోడ్డు నిర్మాణంలో పైప్‌లైన్ ధ్వంసం కావడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ మల్లికార్జున్ పరిశీలించారు. మంగళవారం కౌన్సిలర్లు, కమిషనర్‌తో కలిసి పైప్‌లైన్‌ను పరిశీలించారు. గట్టెపల్లి మానేరు వాగు నుంచి మున్సిపల్ పరిధిలోని వార్డులకు అందించే ప్రధాన పైపులైన్ 5చోట్ల పూర్తిగా ధ్వంసమై నీరు వృథాగా పోతోంది. దీంతో ప్రజలకు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మానేరు వాగులో నీరు అందించే రెండు పెద్ద మోటార్లలో ఒక మోటారు కాలిపోవడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తక్షణమే మరమ్మతు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. సుల్తానాబాద్ నుంచి గట్టెపల్లికి వెళ్లే రోడ్డును ఆర్అండ్‌బీ అధికారులు వెడల్పు కార్యక్రమం చేపడుతుండడంతో మున్సిపల్‌కు మంచినీరు అందించే పైపులైన్లు ధ్వంసం అయ్యాయని, రోడ్డు వెడల్పు నిర్మాణాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నూతన పైప్‌లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు గాజుల లక్ష్మి, రాయమల్లు, నిషాద్, రఫీక్, పారుపల్లి జ్ఞానేశ్వరి, గుణపతి, కూకట్ల గోపి, చింతల సునీత, రాజు, దున్నపోతుల రాజయ్య, రేవల్లి తిరుపతి, గుర్రాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణం కూల్చిన కార్పొరేషన్ అధికారులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్, శాంతినగర్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉత్తర్వులతో మంగళవారం కార్పొరేషన్ అధికారులు కూల్చివేశారు. దీంతో శాంతినగర్‌లో సెప్టెంబర్‌లో వినాయక మండపం కోసం షెడ్డు నిర్మించగా దాన్ని కార్పొరేషన్ అధికారులు కూల్చడంతో కాలనీవాసులు రోడ్డుపై ధర్నాకు దిగారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ దష్టికి తీసుకెళ్లగా కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నాను విరమించారు.

రక్తం అందించడమే లక్ష్యం



రక్తదానం చేస్తున్న వైకే ఫౌండేషన్ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్రవ్యాప్తంగా 5వేలకు పైగా రక్తదానాలు చేసి ఆపదలో ఉన్నవారికి అత్యవసరంగా రక్తం అందించడంమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్ అన్నారు. 2012లో 12వ తేదీన 12నెలల్లో ఫౌండేషన్ స్థాపించి 11ఏళ్లు గడిచి 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో మంగళవారం వైకే ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న 100 మందికి ఫౌండేషన్ సభ్యులు వివిధ ప్రాంతాలకు వెళ్లి రక్తదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వైకే ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్రంలో 5వేలకు పైగా రక్తదానాలు చేసి మొదటిస్థానంలో నిలిచిందన్నారు. అంతేకాకుండా సామాజిక సేవలతో పాటు నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలకు సహకరిస్తే మరింత సేవలు అందించడానికి చాలా మంది ముందుకు వస్తారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శివ, బుర్ర బాబు, యశ్వంత్, అనుదీప్, వైకే ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాజీవ్‌రోడ్డుపై పైపుల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని రాజీవ్ రోడ్డుపై ఉంచిన పైపులను సోమవారం తొలగించారు. రాజీవ్‌రోడ్డుపై ప్రమాదకరంగా పైపులు ఉన్నాయంటూ నవంబర్ 30న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు పైపులను తొలగించి పక్కన వేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి



రామగుండం: రామగుండం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేసి పశువులను ప్రమాదబారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీధర్‌బాబును కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రితో కాంగ్రెస్ నాయకులు

రామగిరి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి ముత్తారం మాజీ జెడ్పీటీసీ మైదం భారతి, మాజీ సర్పంచ్ వేపచెట్టు రాజేశం, నాయకులు పొన్నం సత్యనారాయణగౌడ్, కన్నూరి నర్సింగరావు, చింతం శ్రీనివాస్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీసీ సెల్ జిల్లా కార్యదర్శి

యైటింక్లయిన్‌కాలనీ: మంథని ఎమ్మెల్యే, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా కార్యదర్శి యాదగిరి తిరుపతి మంగళవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్, కౌన్సిలర్లు



పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు కలిశారు. మంగళవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కౌన్సిలర్లు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఆయనకు విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌రావు, సారయ్యగౌడ్, అన్నయ్యగౌడ్, బిరుదు కృష్ణ, రాజయ్య, రఫీక్, రాజు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ట్రాన్స్‌కో అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన విజయరమణారావును మంగళవారం పలు శాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ట్రాన్స్‌కో, మిషన్ భగీరథ, టీఎన్జీఓ, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు. అలాగే ఆశావర్కర్లు, పారిశుధ్య కార్మికులు సైతం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయంలో కార్తీకమాసం పూజలు



మంగళహారతి పాడుతున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్: కార్తీకమాసం చివరి మంగళవారం అమావాస్య నాడు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని వాసవిమాత ఆలయంలో మహిళలు లలిత సహస్రనామార్చన, మంగళహారతులు పాడారు. ఆలయంలో ఓం, స్వస్తిక్ ఆకారంలో దీపాలంకరణ చేశారు. ఆయా గ్రామాల్లో హనుమాన్ మందిరాల్లో అయ్యప్ప స్వాములు భజనలు పాడారు. మండల కేంద్రంలో సరోజ టెంట్‌హౌజ్ నిర్వాహకులు అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు.

మంత్రిని కలిసిన పంచాయతీ ఉద్యోగుల సంఘం



పుష్పగుచ్ఛం ఇస్తున్న సంఘం నాయకులు

సుల్తానాబాద్: కారోబార్ల సమస్యలు తనకు తెలుసునని, కొంచెం సమయం ఇస్తే సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి సీతక్క తెలిపారని గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెంకన్న పటేల్ తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం

- ఆరుబయట చిన్నారులు
- సీడీపీవోకు ఫిర్యాదు చేస్తా: సూపర్‌వైజర్



తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద సూపర్‌వైజర్ విజయ

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. మంగళవారం ఉదయం 9:45కు అయినప్పటికీ కేంద్రం తాళాలు తెరవకపోవడంతో కేంద్రానికి వచ్చిన చిన్నారులు ఆరుబయటే కూర్చున్నారు. సరిగ్గా అదే సమయానికి అంగన్‌వాడీ మండల సూపర్‌వైజర్ విజయ కేంద్రానికి రాగా తాళం వేసి ఉండడం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే సిబ్బందికి ఫోన్‌చేసి కేంద్రం ఎందుకు తెరవలేదని ఆరా తీశారు. అయితే ఆయా లీవ్‌లో ఉందని తనకు జ్వరం వచ్చిందని నిర్వాహకురాలు తెలపడంతో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కేంద్రాన్ని ఎలా మూసి ఉంచుతారని సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత విషయమై సీడీపీవోకు ఫిర్యాదు చేయనున్నట్లు సూపర్‌వైజర్ విజయ తెలిపారు. కాగా కేంద్రం సమీపంలో నూతనంగా మండల విద్యాధికారి కార్యాలయం భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. చిన్నారులు ఆరుబయట ఆడుతూ ప్రమాదానికైనా గురైతే బాధ్యులు ఎవరని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ నిర్వాహకుల తీరులో ఎలాంటి మార్పులు ఉండడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు సమయపాలన పాటించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్: రాష్ట్ర టేబుల్ టెన్నిస్ పోటీలకు ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో సోమవారం కరీంనగర్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 14, 17 బాల, బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఇందులో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు టి.పునీత, సీహెచ్ ఖుషి, ఎం.సంప్రీత్, జి.సుశాంత్, ఎండీ.అర్షఫ్ చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఇండియన్ పబ్లిక్ పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లాకు ఐపీఎస్ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ పాల్గొన్నారు.

టార్గెట్ పేరుతో వేధింపులు ఆపాలి



సుల్తానాబాద్‌లో సమ్మె

సుల్తానాబాద్: పోస్టల్ డాక్‌సేవక్‌లను టార్గెట్ల పేరుతో అధికారుల చేసే వేధింపులను వెంటనే ఆపాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్ డివిజన్ కార్యదర్శి శంకరయ్య కోరారు. మంగళవారం దేశవ్యాప్తంగా జేఏసీలో భాగంగా నిరవధిక సమ్మెలో భాగంగా సుల్తానాబాద్ పోస్ట్ ఆఫీస్ ఎదుట సమ్మె చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిగంటలు 8 గంటలే ఉండాలని పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36ఏళ్ల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ సుల్తాన్, తిరుపతి, సుకుమార్, శ్రీనివాస్, నవనీత, శ్రీనివాస్, జయలత పాల్గొన్నారు.

సమ్మెతో నిలిచిన పోస్టల్ సేవలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉన్న పోస్టాఫీసుల్లో మంగళవారం నుంచి సేవలు నిలిచిపోయాయి. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ యునియన్లు ఇచ్చిన సమ్మె పిలుపు మేరకు గ్రామాల్లోని పోస్టాఫీసులు తెరుచుకోలేదు. 8గంటల పని విధానంతో పాటు పెన్షన్ సౌకర్యం, ఇన్సూరెన్స్ రూ.5లక్షలకు పెంచి, డిపార్ట్‌మెంట్ స్టాఫ్‌తో సమానంగా జీడీఎస్ గ్రాట్యుటీ పెంచాలని, పెయిడ్ లీవ్‌లు నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని, ఇతర డిమాండ్లు ఆమోదించాలని కోరుతూ సమ్మెను ప్రారంభించారు. ఈ సమ్మెతో సేవలు నిలిచి వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. ఎలిగేడు బ్రాంచ్ పరిధిలోని 12 పోస్టాఫీసుల సిబ్బంది సదాశివరెడ్డి, రాజేశం, వెంకటేశ్వర్లు, అనిల్, రజిత, ఉమారాణి, లిఖిత, కమల, సంధ్యారాణి, సోనీ, నాగజ్యోతి, శ్రీకాంత్ సమ్మెలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన ప్రశాంత్

గోదావరిఖనిటౌన్: నగరంలోని సప్తగిరి కాలనీలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల 8వ తరగతి విద్యార్థి బి.ప్రశాంత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రజిత తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దపల్లి జిల్లా మద్దికుంటలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రశాంత్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఈటీ మంథెన వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నూతన నియామకం



సుల్తానాబాద్‌రూరల్: గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి జొన్నకోటి వెంకటేశ్(పెద్దపల్లి)ను నియమించారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులకు వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు.